సంపుటి :02 సంచిక :183 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 12, సెప్టెంబర్ 2025



బొగ్గు బ్లాక్‌లు దక్కకే

## సింగరేణికి ఇబ్బందులు

- కోల్ ఉత్పత్తిపైనే కాకుండా ఖనిజాల వెలికితీతకు ప్రాధాన్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

02

లైంగిక వేధింపుల కేసులో

## పెగడపల్లి తహసీల్దార్ అరెస్ట్

తోటి ఉద్యోగి పట్ల అసభ్య ప్రవర్తన


05



## 'ఇందిరమ్మ' కోసం కాల్ సెంటర్

- మరింత పారదర్శకంగా అమలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

05



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

# జూబ్లీ హీట్

## అన్ని పార్టీలకు సవాల్‌గా ఉప ఎన్నికలు

సై..సై అంటే సై.. అంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్ఠాత్మకం కానున్నాయి. కాంగ్రెస్ పార్టీ తన అధికార బలాన్ని ఉపయోగించి గెలవాలని ఉవ్విళ్లూరుతున్నది. బీఆర్ఎస్ తన సిట్టింగ్ సీటును కాపాడుకునేందుకు సెంటిమెంట్ వినియోగించుకోనున్నది. ఎమ్మెల్యే అభ్యర్థిగా దివంగత మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపనున్నది. బీజేపీ కూడా తన ప్రాభవం చూపించి ఎన్నికల్లో గెలవాలని గెలుపు గుర్రాన్ని వెతికే పనిలో పడ్డది. ఇలా అన్ని పార్టీలు ఉప ఎన్నికలో గెలిచేందుకు పావులు కదుపుతున్నాయి. ఎన్నికల కమిషన్ అధికారికంగా ఎన్నిక షెడ్యూల్‌ను ప్రకటించిన తర్వాత, రాజకీయ పోరాటం మరింత వేడెక్కనుంది. ఈ ఎన్నికలో గెలుపు కాంగ్రెస్‌కు రెఫరెండంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి త్వరలో రెండేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో ఇతర ప్రతిపక్ష పార్టీలు సైతం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారా రాబోయే రోజుల్లో గెలిచేది తామేనని చెప్పేందుకు ఎవరి వ్యూహాల్లో వారున్నారు.

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే గోపినాథ్ సతీమణి సునీత
- ఆమె ఎంపిక ఇక లాంఛనమే..
- కాంగ్రెస్ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి పేరు
- బీజేపీ నుంచి రావుల శ్రీధర్‌రెడ్డి, విక్రమ్ గౌడ్ పేర్లు
- రోజురోజుకూ వేడెక్కుతున్న రాజకీయ పరిణామాలు

02

## ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- బాలసముద్రం డబుల్ బెడ్ రూం ఇళ్లలో పర్యటన
- అధికారులతో కలసి రోడ్లు, సైడ్ డ్రైనేజీ, విద్యుత్తు,నీళ్ల సంపుల పరిశీలన



04



## విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

- ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తాం..
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- భూపాలపల్లి జిల్లా మహాముత్తారంలో కేజీబీవీ భవన ప్రారంభోత్సవం

05

- **కోల్ ఉత్పత్తిపైనే కాకుండా ఖనిజాల వెలికితీతకు ప్రాధాన్యం**
- **తద్వారా భవిష్యత్తులో సంస్థకు 37.5 శాతం రాయల్టీ**
- **గ్రీన్ ఎనర్జీ రంగంలోకీ సంస్థ**
- **ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క**

## బొగ్గు బ్లాక్ లు దక్కకే సింగరేణికి ఇబ్బందులు




అక్షరదర్బార్, హైదరాబాద్: సింగరేణి సంస్థ బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఇతర ఖనిజాల వెలికితీత వైపూ అడుగులు వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఆయన సింగరేణి సీఎండీ బలరాంతో మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో మార్పులకు అనుగుణంగా సింగరేణి అభివృద్ధి చెందుతోందని వెల్లడించారు. సంస్థకు కొత్త బొగ్గు బ్లాకులు దక్కకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆయన అన్నారు. సంస్థ ఇప్పుడు బొగ్గుతో పాటు ఇతర ఖనిజాల అన్వేషణపైనా దృష్టి పెట్టిందని స్పష్టం చేశారు. కర్ణాటకలోని రాయచూర్, దేవదుర్గ్ ప్రాంతాల్లో రాగి, బంగారం నిల్వల అన్వేషణపై అధ్యయనం చేస్తున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏ సంస్థ అయినా అక్కడ రాగి, బంగారం మైనింగ్ చేస్తే సింగరేణికి 37.75 శాతం రాయల్టీ లభిస్తుందని ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కూడా కీలక ఖనిజాల వెలికితీతలో కేంద్ర ప్రభుత్వం సింగరేణికి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. సంస్థ గ్రీన్ ఎనర్జీ రంగంలోకి కూడా అడుగుపెట్టిందన్నారు. రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయని, సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు వ్యక్తులకు వెళ్లిపోతాయని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ప్రైవేటు వారికి దక్కాయని ఆయన గుర్తుచేశారు.



www.aksharadarbar.com
అక్షర దర్బార్
Voice of the people

# జూబ్లీ హీట్

## అన్ని పార్టీలకు సవాల్‌గా ఉప ఎన్నికలు




**జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్ఠాత్మకం కానున్నాయి. కాంగ్రెస్ పార్టీ తన అధికార బలాన్ని ఉపయోగించి గెలవాలని ఉవ్విళ్లూరుతున్నది. బీఆర్ ఎస్ తన సిట్టింగ్ సీటును కాపాడుకునేందుకు సెంటిమెంట్ వినియోగించుకోనున్నది. ఎమ్మెల్యే అభ్యర్థిగా దివంగత మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపనున్నది. బీజేపీ కూడా తన ప్రాభవం చూపించి ఎన్నికల్లో గెలవాలని గెలుపు గుర్రాన్ని వెతికే పనిలో పడ్డది. ఇలా అన్ని పార్టీలు ఉప ఎన్నికలో గెలిచేందుకు పావులు కదుపుతున్నాయి. ఎన్నికల కమిషన్ అధికారికంగా ఎన్నిక షెడ్యూల్‌ను ప్రకటించిన తర్వాత, రాజకీయ పోరాటం మరింత వేడెక్కనుంది. ఈ ఎన్నికలో గెలుపు కాంగ్రెస్‌కు రెఫరెండంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి త్వరలో రెండేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో ఇతర ప్రతిపక్ష పార్టీలు సైతం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారా రాబోయే రోజుల్లో గెలిచేది తామేనని చెప్పేందుకు ఎవరి వ్యూహాల్లో వారున్నారు.**

- **సై..సై అంటే సై.. అంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే గోపినాథ్ సతీమణి సునీత**
- **ఆమె ఎంపిక ఇక లాంఛనమే..**
- **కాంగ్రెస్ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి పేరు**
- **బీజేపీ నుంచి రావుల శ్రీధర్‌రెడ్డి, విక్రమ్ గౌడ్ పేర్లు**
- **రోజురోజుకూ వేడెక్కుతున్న రాజకీయ పరిణామాలు**

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ స్థానాన్ని దక్కించుకునేందుకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, భారాస, బీజేపీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పార్టీలు తమ అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి వ్యూహాల వరకు జాగ్రత్తగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ప్రధాన పార్టీలతో పాటు, ఎంఐఎం, జనసేన వంటి పార్టీలు కూడా ఈ ఉప ఎన్నికలో పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. నియోజకవర్గంలో గణనీయమైన ముస్లిం ఓటర్లు ఉన్నందున ఎంఐఎం కూడా తన ప్రాభవాన్ని చూపేందుకు పోటీ చేయాలని నిర్ణయించుకుంటే అది ఫలితాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. స్త్రాలుగా మలచుకోవాలని గులాబీ పార్టీ భావిస్తోంది.

### - కాంగ్రెస్ పార్టీ పావులు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మరణంతో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా శ్రీగణేశ్ గెలిచారు. దీంతో బీఆర్ఎస్ సిట్టింగ్ సీటును కోల్పోయింది. ఇప్పుడు గోపీనాథ్ మరణంతో జరుగుతున్న ఉప ఎన్నికలోనూ ఓటర్లు తమకే పట్టం కడతారని కాంగ్రెస్ భావిస్తున్నది. ఈ ఎన్నికలో గెలుపు ద్వారా తమ పాలన కు ప్రజల రెఫరెండం అని బలంగా చెప్పవచ్చని భా విస్తూ ఇప్పటికే కొన్ని వ్యూహాలు అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వంటి నేతలు నియోజకవర్గంలో గెలుపుపై ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ కు నియోజకవర్గంలోని డివిజన్ల బాధ్యతలు అప్పగించారు. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు, పేదలకు సన్నబియ్యం సహా ఇతర హామీల అమలు వంటి అంశాలను ఎన్నికల ప్రచారంలో అస్త్రాలుగా వాడనున్నారు.

### - కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు?

మొదట్లో అజారుద్దీన్, మాజీ మంత్రి దానం నాగేందర్ ఎన్నికల్లో పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. అజారుద్దీన్‌కు పార్టీ ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టడంతో ఇక ఆయనకు సీటు ఇవ్వరని పార్టీ వర్గాలు భావించాయి. దానం నాగేందర్ కూడా తాజాగా తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని తేల్చిచెప్పారు. ఇక తెరపై ఉన్న పేరు పి. విష్ణువర్ధన్ రెడ్డి. పార్టీ ఎవరిని అభ్యర్థిగా ఎంపిక చేస్తుందో వేచి చూడాల్సిందే.

### - బీజేపీ నుంచి?

ఉప ఎన్నికను బీజేపీ సైతం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు దాకా నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పార్టీ ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేటర్లతోనూ ముమ్మర ప్రచారం నిర్వహిస్తోంది. ఈ ఎన్నిక కోసం మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి బూత్‌స్థాయిలో సమన్వయం చేస్తోంది. బీజేపీ నుంచి రావుల శ్రీధర్ రెడ్డితో పాటు పలువురు నాయకుల పేర్లు ఆశావహుల జాబితాలో ఉన్నాయి. మాజీ మంత్రి ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ కూడా సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

### - ఎంఐఎం నుంచి..

ఎంఐఎం పార్టీ నుంచి మహ్మద్ నస్రుద్దీన్ అనే నేతకు పార్టీ సీటు ఇవ్వొచ్చనే ప్రచారం జోరుగా సాగుతున్నది. అలాగే స్వతంత్ర అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది.

### - ఓటర్ల సంఖ్య.. సామాజిక సమీకరణాలు..

ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,04,288 మంది పురుషులు, 1,88,356 మంది మహిళలు, 25 మంది ఇతరులు. నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు గణనీయంగా ఉండటం, వారి మద్దతు ఎవరికి ఇస్తే ఆ అభ్యర్థి గెలుపు సునాయసమనే చర్చ నడుస్తున్నది.

### బీఆర్ఎస్ అభ్యర్థి సునీత..



**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అన్ని పార్టీలూ సవాల్‌గా తీసుకోవడంతో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్నాయి. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ నియోజకవర్గపు ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీత కూడా హాజరు కావడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. దీంతో బీఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ దాదాపు ఆమె పేరు ఖరారు అని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో గోపీనాథ్ మరణం వల్ల సానుభూతి పవనాలు బీఆర్ఎస్‌కు ఉపకరించగలవని పార్టీ నేతలు భావిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, హైడ్రా కూల్చివేతలవంటివి అస్త్రాలుగా మలచుకోవాలని గులాబీ పార్టీ భావిస్తోంది**

# కోతుల సమస్యను పరిష్కరించాలి

## సీపీఎం మండల కార్యదర్శి వాసు



అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం: మండల కేంద్రంలో తీవ్రతరమవుతున్న కోతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం బృందం ఫారెస్ట్ కార్యాలయానికి వెళ్లి ఫారెస్ట్ సిబ్బందికి మెమోరాండం అందజేసింది.ఈ సందర్భంగా గ్యానం వాసు మాట్లాడుతూ, మూడు సంవత్సరాలుగా కోతుల సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కోతులు ఇళ్లలోకి చొరబడి వస్తువులు ధ్వంసం చేస్తున్నాయని, రైతులు పెంచిన కూరగాయలు, ఆకుకూరలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.చిన్న, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నాయని ఆయన తెలిపారు. కోతుల సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని, సిపిఎం పార్టీ దశల వారీగా పోరాటాలు చేపడుతుందని గ్యానం వాసు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కట్ల నరసింహాచారి, కోగిల మాణిక్యం, నాగేశ్వరరావు, కురసం మల్లయ్య, మీడియం నగేష్, దామోదర్ పాల్గొన్నారు.





వాగు ప్రవాహంలో చిక్కుకున్న ట్రాక్టర్లు, కూలీలు



కానిస్టేబుల్ ను సన్మానిస్తున్న ఉన్నతాధికారులు

# వాగు ప్రవాహంలో చిక్కుకున్న ట్రాక్టర్లు

- వాగులో చిక్కుకున్న నలుగురు కూలీలను రక్షించిన పోలీసులు
- సత్కరించిన అడిషనల్ కలెక్టర్. ఆర్డీవో, సీఐ మల్లేష్

అక్షరదర్బార్, టేకుమట్ల/ భూపాలపల్లి క్రైమ్: : భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళపల్లి సమీపంలోని ఓడేడు మానేరు వాగులో శుక్రవారం ఉదయం ఓ ఘటన చోటుచేసుకుంది. ఇసుక కోసం వాగులోకి వెళ్లిన ట్రాక్టర్లు అకస్మాత్తుగా పెరిగిన నీటి ప్రవాహంలో ఇరుక్కుపోయాయి. ఒక్కసారిగా వాగు నీటి మట్టం పెరగడంతో ట్రాక్టర్లు కదలలేని స్థితిలో నిలిచిపోయి, అందులో ఉన్న నలుగురు ప్రాణాపాయంలో చిక్కుకున్నారు.108 ద్వారా సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై సుధాకర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తన సిబ్బందితో ప్రాణాలకు తెగించి తాడు సహాయం తీసుకుని చిక్కుకున్న వారిని ఒక్కొక్కరిని కాపాడారు. ఈ రక్షణ చర్యల్లో పోలీస్ సిబ్బంది మహేందర్, రమేష్, వెంకటేష్, (టీఎస్ఎస్పీ) సిబ్బంది కీలక పాత్ర పోషించి ప్రాణాలను రక్షించారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చింది. పోలీసులు చేసిన సాహసోపేత రక్షణ చర్యలకు గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు. అనంతరం సిబ్బంది మహేందర్ ని అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో రవి సత్కరించారు.



# పరకాల పట్టణంలో పారిశుధ్య పనులు

- డ్రైనేజీ శుభ్రం చేయించిన మాజీ కౌన్సిలర్ పూర్ణాచారి

అక్షర దర్బార్, పరకాల: గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పరకాల మున్సిపాలిటీ లోని 9వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమైంది. సైడ్ డ్రైనేజీల్లో చెత్తాచెదారం నిలిచిపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి, స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్మికుల సహకారంతో డ్రైనేజీల శుభ్రత పనులు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే ఉద్దేశంతో ఆయనే స్వయంగా పరిసరాల్లో పర్యటించి, కార్మికులతో కలిసి శుభ్రత పనులను పర్యవేక్షించారు. స్థానికులు పూర్ణాచారి తీసుకున్న చొరవను ప్రశంసించారు.

# విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

## పరకాల ఎస్ఐ పవన్




అక్షర దర్బార్, పరకాల: ప్రభుత్వ జూనియర్ కళాశాల పరకాలలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన కొరకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. పరకాల కళాశాల నుండి అంబేద్కర్ కూడలి వరకు విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. అనంతరం కళాశాలలో ప్రిన్సిపల్ కే సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరకాల ఎస్ఐ పవన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సాధించాలన్నారు. విద్యార్థులచే మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేసి గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎండి సర్దార్, సీనియర్ అధ్యాపకులు మహిపాల్ రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ పద్మ, యాంటీ డ్రగ్స్ కమిటీ మెంబర్స్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు .




# ఇందిరమ్మ లబ్ధిదారులకు అన్యాయం

- మైపాల్ క్రషర్ పై చర్యలు తీసుకోవాలి
- ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చిన సిపిఎం నాయకులు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో ఇందిరమ్మ హౌసింగ్ లబ్ధిదారులకు కేటాయించిన మైపాల్ క్రషర్ అన్యాయంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, సిపిఎం పార్టీ నేతలు పరకాల ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ, హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన మైపాల్ క్రషర్ ను పరకాల పట్టణంలోని వివిధ వార్డులకు ఇందిరమ్మ లబ్ధిదారులు తమకు ఇచ్చిన ప్రొసిడింగ్ లెటర్లతో క్రషర్ వద్దకు వెళ్లినప్పటికీ, అక్కడి సిబ్బంది "మేము పొయ్యము, మాకు ఇందిరమ్మ పథకంతో సంబంధం లేదు" అంటూ తిరస్కరించారని ఆరోపించారు. అదేసమయంలో, టన్ను రూ 800 కు కొనాలంటూ, "ఇష్టమైతే పోసుకోండి, లేదంటే వద్దు" అంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇది లబ్ధిదారులపై జరిగే అన్యాయం అని, అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, మైపాల్ క్రషర్ పై కఠిన చర్యలు తీసుకుని, లబ్ధిదారులకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మడికొండ ప్రశాంత్, ఇతర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో దుక్కిటెద్దు మృతి



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలోని కౌకొండ గ్రామంలో గురువారం సాయంత్రం వచ్చిన వర్షం సమయంలో గ్రామానికి చెందిన ఓదెల భాస్కర్‌కు చెందిన దుక్కిటేద్దు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది.ఈ దుక్కిటేద్దు విలువ సుమారు రూ. 95,000 ఉంటుందని తెలిపారు. మరో ఎద్దు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. అంతేకాకుండా, పిడుగుపాటుతో భాస్కర్ ఇంటి తో పాటు చుట్టుప్రక్కల ఇండ్లలో విద్యుత్ బోర్డులు, ఫ్యాన్లు సహా పలు ఎలక్ట్రానిక్ సామగ్రి కాలిపోయినట్లు పేర్కొంటున్నారు.



# కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలి

- నిజామాబాద్ జిల్లా ఇంచార్జీ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, భూపాలపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఈ డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు సెప్టెంబర్ 15న కామారెడ్డిలో నిర్వహించబోయే బీసీ డిక్లరేషన్ బహిరంగ సభను విజయవంతం చేయాలని నిజామాబాద్ జిల్లా ఇంచార్జి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు.నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాల్లోనూ బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ఇప్పటికే తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే కేంద్రం చట్టబద్ధత ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. ఈనెల 15న కామారెడ్డిలో జరిగే సభకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవనున్నారని, సుమారు రెండు లక్షల మంది సభలో పాల్గొంటారని ఆయన తెలిపారు. సభను విజయవంతం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు.



# వివి ప్యాట్, ఈవీఎంల గోదామును పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం వివి ప్యాట్ (VVPAT), ఈవీఎంల గోదామును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన గోదాములో భద్రపరచిన యంత్రాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లు, సాంకేతిక అంశాలు, సీసీ కెమెరా పర్యవేక్షణ, సీల్ వేసిన తాళాలను సమగ్రంగా పరిశీలించారు. గోదాముల వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్ట భద్రత ఉండాలని, పర్యవేక్షణ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నాయకులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వాచ్ మెన్ మృతి



అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా దామెర మండలం డిస్నీల్యాండ్ స్కూల్ వద్ద గురువారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వాచ్మెన్ ఫైండ్ల సూరయ్య (పరకాల) అక్కడికక్కడే మృతి చెందాడు. సూరయ్య తన చిన్న కూతురు ఊరు రామచంద్రాపురం వెళ్లి తిరిగి వచ్చిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మృతుని కోడలు ఫైండ్ల సంధ్య ఫిర్యాదు మేరకు దామెర ఎస్సై కొంక అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# నల్లబెల్లి రోడ్డుపై ప్రజాసంఘాల బైఠాయింపు

అక్షర దర్బార్ నల్లబెల్లి : నల్లబెల్లి మండల కేంద్రంలో యూరియా బస్తాలను వ్యాపారస్తులు అధికారులతో కుమ్మక్కై దొంగ చాటుగా విక్రయిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు బట్టు సాంబయ్య బొట్ల నరేష్ ఆధ్వర్యంలో నల్లబెల్లి మండల కేంద్రంలో బైఠాయించినారు ఈ ఆందోళనలో రైతులు మద్దతు పలుకుతూ వారి వెంట రోడ్డుపై కూర్చున్నారు స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని రైతులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు వ్యాపారస్తులతో కుమ్మక్కైన అధికారులను సస్పెండ్ చేయాలని కలెక్టర్ గారిని వారు కోరారు .



# ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- బాలసముద్రం డబుల్ బెడ్ రూం ఇళ్లలో పర్యటన
- అధికారులతో కలసి రోడ్లు, సైడ్ డ్రైనేజీ, విద్యుత్తు,నీళ్ల సంపుల పరిశీలన

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ బాలసముద్రంలో గల ఇందిరమ్మ రెండు పడకల ఇండ్ల కాలనీలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న కాలనీ వాసులందరి మధ్య అధికారులతో కలసి కావాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. ప్రధానంగా విద్యుత్తు, మంచి నీరు, డ్రైనేజీ వ్యవస్థ వంటి అంశాలపై దృష్టి సారించాలని యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం స్థానికుల సమస్యలను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని మాట్లాడూతు అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్న బస్తీ వాసుల సమస్యలను పరిష్కరించాలని, విద్యుత్, నీటి సరఫరా ఇళ్లను కేటాయించిన తరువాత ఇవ్వాలని ముందు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. పట్టాల మంజూరు తరువాత జిల్లా కలెక్టర్అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించామని, ప్రాధాన్యత పరంగా తొలుత విద్యుత్ సరఫరా అందించేందుకు రూ.45 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. ఇక్కడ ఉన్న సంపు(నీటి తొట్టె)లకు నీటి సరఫరా కల్పిస్తానని తెలిపారు. మున్సిపాలిటీ స్వచ్ఛత విషయంలో రాజీలేకుండా కాలనీల్లో చెత్త సేకరణ కుండీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మించాక చాలా ఏళ్ల తర్వాత ప్రారంభించిన క్రమంలో చాలా వరకు డోర్స్, కిటికీలు ధ్వంసమైనప్పటికీ మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇళ్ల పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగలేదని, కానీ ఇంకొంత మందికి ఇళ్లు రావాలని నా దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. రానున్న రోజుల్లో ఇక్కడ అర్హత కలిగిన వారికి తప్పకుండా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సొంతంగా ఇంటి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో అర్హులుగా ఎంపిక చేస్తానని తెలిపారు. బాల సముద్రంలో ప్రస్తుతానికి ఎటువంటి ఇళ్లు లేవని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. గతంలో పలువురు దళారులు చాలా మంది వద్ద డబ్బులు వసూలు చేశారని, వారిని గుర్తించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇంకా మోసపోయిన వారు ఉంటే ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# బుచ్చిరెడ్డిని విమర్శించడం తగదు



అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట కాంగ్రెస్ పార్టీ నాయకుల ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంత మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం తగదు అని కాంగ్రెస్ పార్టీ ప్రగతి సింగారం ప్రధాన కార్యదర్శి మూలగుండ్ల సందీప్ రెడ్డి అన్నారు. ప్రజల పక్షాన నిలబడే నాయకుడు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధూదిపాల బుచ్చిరెడ్డిపై లేనిపోని విమర్శలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.




# డెయిలీ వేజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

- సర్క్యులర్ ప్రకారం జీతాలు చెల్లించాలి
- జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె

అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం, సెప్టెంబర్ 12:గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లను పర్మనెంట్ చేయాలని, తగ్గించిన వేతనాలకు సంబంధించిన జీవో 64ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్స్ జేఏసీ ఆధ్వర్యంలో వెంకటాపురం మండలంలోని లక్ష్మీనగరం, చిరుతపల్లి హాస్టల్స్ వద్ద నిరవధిక సమ్మె ప్రారంభమైంది.సమ్మెను సిపిఎం మండల కార్యదర్శి గ్యానం వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వం వేతనాలు పెంచాల్సిన సమయంలో తగ్గించడం ద్వారా గిరిజన కార్మికులపై అన్యాయం చేస్తోంది. గత 30 ఏళ్లుగా లేని ఆంక్షలను ఆర్థిక శాఖ పేరుతో అమలు చేస్తోంది" అని విమర్శించారు.పెండింగ్లో ఉన్న ఆరు నెలల వేతనాలను కలెక్టర్ సర్క్యులర్ ప్రకారం ట్రెజరీల ద్వారా వెంటనే విడుదల చేయాలని, మరణించిన వర్కర్ల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు 10 లక్షల బీమా, 5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్, అంత్యక్రియల ఖర్చు రూ.50,000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదనంగా వారాంతపు సెలవులు, రెండు జతల యూనిఫాంలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభావతి, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాట్రపల్లి-గంగిరేణి గూడెం రోడ్డును మరమ్మత్తు చేయాలి



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలోని కాట్రపల్లి గ్రామం నుండి గంగిరేణి గూడెం, గోరుకొత్తపల్లి, రేగొండ, భూపాలపల్లి, కాలేశ్వరం వైపు వెళ్లే రహదారి దయనీయ స్థితిలో ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అప్పటి శాసనసభ స్పీకర్ మధుసూదన చారి ప్రత్యేక నిధులతో రూ.1.16 కోట్ల వ్యయంతో బీటీ రహదారి నిర్మించినప్పటికీ, పాలకుల నిర్లక్ష్యంతో రహదారి కనీసం నడవలేని స్థితికి చేరిందని కాట్రపల్లి మాజీ ఎంపీటీసీ షేక్ అనిఫాగౌస్ విమర్శించారు. ప్రజల సౌకర్యం కోసం ఈ రహదారిని తక్షణమే మరమ్మత్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడమే కాకుండా, గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల అభివృద్ధి నిధులు రాకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితిని సరిచేయడానికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 'ఇందిరమ్మ' కోసం కాల్ సెంటర్

- **మరింత పారదర్శకంగా అమలు**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

అక్షరదర్బార్, జనగామ: ఇందిరమ్మ ఇళ్ల పథకం మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు, అలాగే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని శుక్రవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. పేదవారి సొంతింటి కల సాకారం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా నిర్మాణాలకు సంబందించి దశలవారిగా లబ్ధిదారులకు మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తుంది. ఈ క్రమంలో ఇల్లు నిర్మాణం సమయంలో పలు



అంశాలకు సంబంధించి లబ్ధిదారుల్లో అనేక అనుమానాలు వస్తున్నాయని, వీటికి సరైన సమాధానాలు చెప్పేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. హిమాయత్ నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో దీన్ని ఏర్పాటు చేశారని.. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కాల్ సెంటర్‌ను ప్రారంభించారన్నారు. దీనికి 1800 599 5991 టోల్ ఫ్రీ నంబర్‌ను కేటాయించారని.. ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పని చేసే ఈ కాల్ సెంటర్ కి లబ్ధిదారులు, సామాన్య ప్రజల నుంచి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను సిబ్బంది తెలుసుకుని వాటిని నోట్ చేసుకుని సంబంధిత అధికారులకు పంపి పరిష్కారం అయ్యేలా చూస్తారన్నారు . అంతే కాకుండా లబ్ధిదారులే నేరుగా వెబ్ సైట్ లో వారి ఇంటి నిర్మణాలకు సంబందించిన ఫోటోలను అప్ లోడ్ చేసుకునే అవకాశాన్ని, అలాగే వారి వివరాలను సమర్పిస్తే బిల్స్ స్టేటస్ ను తెలుసుకునే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు. అర్హులైన లబ్ధిదారులు వారి సొంత ఇంటి కలను నెరవేర్చుకునే క్రమంలో ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా మొదటి నుండి ప్రభుత్వం అనేక రకాలుగా చర్యలు తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పూర్తి పారదర్శకంగా అమలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు.





- **ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తాం..**
- **మెగా డీఎస్సీ నిర్వహించి భారీగా టీచర్లను నియమించాం..**
- **అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వసతుల కల్పన**
- **రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
- **భూపాలపల్లి జిల్లా మహాముత్తారంలో కేజీబీవీ భవన ప్రారంభోత్సవం**

# విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

అక్షరదర్బార్, మహాముత్తారం: ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, విద్యతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యుద్ధ ప్రాతిపదికన కృత్రిమ మేధస్సు (ఏఐ) ల్యాబ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. శుక్రవారం మహా ముత్తారం మండలంలో రూ. 2.30 కోట్లతో నిర్మించిన కేజీబీవీ జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించి మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల ద్వారా అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. నాణ్యమైన విద్యాబోధన కోసం డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల నియామకం చేపట్టామని, పదేళ్లుగా పెండింగ్ ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని చెప్పారు. అలాగే, విద్యార్థులకు కాస్మెటిక్, డైట్ చార్జీలు పెంచి నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తమ కాళ్ళపై తాము నిలబడాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. విద్యార్థులు ఒక ప్రణాళిక ప్రకారం ప్రతిరోజు ఏదో ఒక పుస్తకం చదవాలని, అది వారి ఉజ్వల భవిష్యత్తుకు తప్పక ఉపయోగపడుతుందని మంత్రి సూచించారు. తాను కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు లేకపోవడం వల్ల ఆంగ్ల మాధ్యమంలో చదువుకోగలిగానని, నాలాగే ప్రతి ఒక్క విద్యార్థి ఇంగ్లీషులో చదువుకోవాలని ఆకాంక్షించారు. బాలికా విద్యకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మన ప్రాంతానికి పెద్ద ఎత్తున కేజీబీవీ, మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేశామని గుర్తు చేసుకున్నారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రగతి కోసమే సీఎంని కలిశాం

- **మా ఫొటోలను మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేశారు..**
- **స్పీకర్ నోటీసులకు దానం, కడియం మినహా మిగతా 8 మంది ఎమ్మెల్యేల వారి వివరణ**
- **తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్న స్పీకర్**



అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగతా ఎనిమిది మంది తాము పార్టీ మారలేదని, ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని స్పీకర్‌కు ఇచ్చిన వివరణల్లో స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ), ఎం సంజయ్ కుమార్ (జగిత్యాల), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల్), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్చెరు), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి), కాలే యాదయ్య (చేవెళ్ల), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్) తాము కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రిని కలిశామని, తమ ఫోటోలను మార్ఫింగ్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు స్పీకర్‌కు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆ పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ వివరణ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేల అనూహ్య వివరణతో, స్పీకర్ కార్యాలయం తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యేల వాదనపై బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయం కోరుతూ స్పీకర్ ఆ పార్టీకి లేఖ రాశారు. మూడు రోజుల్లోగా దీనిపై స్పందించాలని సూచించారు. దీంతో, ఇప్పుడు బంతి బీఆర్ఎస్ కోర్టులోకి చేరింది. ఫిరాయింపులపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యేల వివరణపై ఎలా స్పందిస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ లేఖపై ఆ పార్టీ స్పందన ఆధారంగానే భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# లైంగిక వేధింపుల కేసులో పెగడపల్లి తహసీల్దార్ అరెస్ట్

**- తోటి ఉద్యోగి పట్ల అసభ్య ప్రవర్తన**

అక్షరదర్బార్, జగిత్యాల: తోటి మహిళ ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే ఆరోపణల నేపథ్యంలో పోలీసులు శుక్రవారం జగిత్యాల జిల్లా పెగడపల్లి ఎమ్మార్వో రవీందర్ ను అదుపులోకి తీసుకున్నారు. తనను వాహనంలో ఎక్కించుకొని తహసీల్దార్ పట్టణ శివారులోని నిర్మానుష్య ప్రాంతాల్లో తిప్పాడని, వాట్సాప్ లో అసభ్యకరంగా మెసేజ్ లు చేశాడని తహసీల్దార్‌పై బాధితురాలు జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తుందన్న విషయం తెలుసుకున్న ఎమ్మార్వో జగిత్యాలకు చెందిన మరో ఎమ్మార్వో ద్వారా రాజీ కుదుర్చుకునే ప్రయత్నం చేశాడు. సదరు ఎమ్మార్వోను కాపాడేందుకు రంగంలోకి దిగిన మరో ఎమ్మార్వో బాధితురాలిని రకరకాల ఒత్తిళ్లకు గురిచేశాడు. అయినా మహిళ వినకపోవడంతో రాజీ ప్రయత్నం విఫలమైంది. పోలీసులు ఎమ్మార్వో రవీందర్‌ను రిమాండ్ కు తరలించారు. గౌరవప్రదమైన ఉద్యోగి స్థానంలో ఉండి తోటి ఉద్యోగిని పట్ల అసభ్యంగా ప్రవర్తించి అరెస్టవడం రాష్ట్రంలో సంచలనంగా మారింది.

# బియ్యం నిల్వ కేంద్రం నిర్వహణపై కలెక్టర్ సీరియస్



అక్షరదర్బార్, వరంగల్: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం వరంగల్ ఏనుమాములలో ఉన్న మండల బియ్యం నిల్వ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖీలో కేంద్రంలో నిల్వ ఉన్న బియ్యం నాణ్యత, నిల్వ విధానం, భద్రతా ఏర్పాట్లు, రికార్డు నిర్వహణను పరిశీలించారు. ముక్కిన బియ్యం, విద్యార్థులకు సరఫరా చేసే మధ్యాహ్న భోజన పథకం బియ్యం ఒకే ప్రాంతంలో ఉండడాన్ని గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పౌరసరఫరాల డీఎం, ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జిలకు శ్రీముఖాలు జారీ చేయాలని అదనపు కలెక్టర్ ను ఆదేశించారు. తనిఖీల్లో పట్టుబడ్డ బియ్యాన్ని వెంటనే వేలం వేయుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.





# మీ గొంతుక! మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**



Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915